నవతెలంగాణ 1
మెదక్
సోమవారం | 08 ఏప్రిల్ 2024 | www.navatelangana.com

ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలి

పక్కాప్రణాళికతో ఎన్నికలకు సంసిద్ధం అవ్వండి
నీలం మధుతో సీఎం రేవంత్ రెడ్డి



నవతెలంగాణ-పటాన్‌చెరు

తుక్కుగూడలో జరిగిన జనజాతర సభ సక్సెస్‌తో కలిసి కట్టుగా ముందుకు కదిలి మెదక్ పార్లమెంట్ తరవున జన సమీకరణ చేసి విజయవంతం చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మెదక్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ సీఎం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సభ విజయ ఎవంతానికి కలిసి పనిచేసిన నీలం మధును ముఖ్యమంత్రి రేవంత్ అభినందించారు. సభను విజయవంతం చేసిన స్ఫూర్తితో ప్రజలలోకి వెళ్లాలని సూచించారు. అందరి నాయకులతో ఐక్యంగా కలిసి ముందుకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

తాటిపల్లి పెద్దగుట్ట దర్గా వద్ద మొక్కు తీర్చుకున్న మంత్రి



నవతెలంగాణ-మునిపల్లి

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అందోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దామోదర రాజనర్సింహ గెలుపొందాలని మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మారుతి, మహిపాల్ గ్రామంలోని పెద్దగుట్ట యాదుల్లా హుస్సేన్ దర్గాలో మొక్కులు మొక్కారు. అయితే ఎన్నికల్లో దామోదర రాజనర్సింహ్మ గెలుపొంది మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో.. ఆదివారం గ్రామంలోని దర్గాను మంత్రి దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మంత్రిని మండల నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, ప్రదీప్ రెడ్డి, రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడు మృతి



నవతెలంగాణ-గుమ్మడిదల

తండ్రిని డబ్బులు అడిగితే ఇవ్వకపోవడంతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గుమ్మడిదల గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదల గ్రామానికి చెందిన పిట్ల నవీన్(24) అనే యువకుడు మూడ్రోజుల క్రితం తన మిత్రుడు వివాహానికి వెళ్లడానికి డబ్బులు కావాలని తండ్రిని అడిగాడు. అయితే తన వద్ద డబ్బులు లేవని తండ్రి చెప్పడంతో.. నవీన్ తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సూరారంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న ఆ యువకుడు పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. నవీన్ మృతిపై ఎలాంటి అనుమానం లేదని అతడి తండ్రి పిట్ల బాలేష్, కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేసినట్టు పోలీసులు తెలిపారు.



అప్పన్న హస్త మిత్ర ఆధ్వర్యంలో సహాయం

నవతెలంగాణ-గజ్వేల్

ఆపన్నహస్త మిత్ర బృందం గజ్వేల్ వారి 86 వ ఆర్థిక సహాయ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం గజ్వేల్ మండలం రిమ్మన గూడ గ్రామానికి చెందిన శివగల్ల మధు కృష్ణ ఇసుక లారీ డ్రైవర్ గా పని చేస్తూ తిరిగి ఇంటికి వస్తున్న నేపథ్యంలో ప్రమాదవశాత్తు జరిగింది. ప్రస్తుతం నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. అస్తి పాస్తులు కూడా లేవు ఇతనికి భార్య,ముగ్గురు అడ పిల్లలు ఉన్నారు. ఉండడానికి ఇల్లు కూడా లేదు కావున వీరికి భరోసాగా మన వంతు రూ 20,000/- నగదు , ఆరోగ్య ఖర్చుల కోసం వారి తల్లి తండ్రులకు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పాశికంటి బాలచంద్రం, ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, కోషాధి కారి కొల్లూరి శ్యామ్ ప్రసాద్,సభ్యులు ,కొలిచెలిమే స్వామి, ,సత్యనారాయణ, అరవింద్ , ధనరాజ్ , బాల్ శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



మద్దూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండల కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని రైతులు పండించిన పంటను విక్రయించుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో సిఏ జెబా తబుసుమ్,రైతులు ఎఫ్ఎం షౌకత్ అలీ, హమీద్, పిట్టల నరేష్, రమేష్, శ్రీనివాస్, మల్లేశం, ఐకెపి నిర్వాహకులు లక్ష్మీ,సుజాత, తదితరులు పాల్గొన్నారు

రైతుల శ్రేయస్సు కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



నవతెలంగాణ-నంగునూరు

రైతులు దళారుల బారిన పడకుండా తాము పండించిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధరను పొందాలని తాజా, మాజీ సర్పంచ్ బిక్షపతి నాయక్ తెలిపారు.ఆదివారం నంగునూరు మండలం జేపీ తాండా,ముగ్దుంపూర్ గ్రామాల్లో సొసైటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బిక్షపతి మట్లాడుతూ రైతులు తాము పండి ంచిన ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా వడ్ల కొనుగోలు కేంద్రాలలోనే విక్రయి ంచాలన్నారు. వడ్లు కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందవచ్చన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2203 బి గ్రేడ్ ధాన్యానికి రూ.2183/- ప్రభుత్వం ధర నిర్ణయం చేసిందన్నారు.రైతులు పండిం చిన ధాన్యాన్ని నేరుగా వడ్ల కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటి సిబ్బంది, నిర్వాహకులు, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఎఫ్ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శిగా కెమ్మసారం శ్రావణ్



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

ఆదివాసుల అభివృద్ధి హక్కుల కోసం నిరంతరం కృషి చేయాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వలువాయి ఉషాకిరణ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర జిల్లా అధ్యక్షుల ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఎన్ టి ఎఫ్ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శిగా కెమ్మసారం శ్రావణ్ ను నేషనల్ ట్రైబల్ ఎంప్లాయ్ ఫెడరేషన్ అధ్యక్షులు బండి నర్సింలు తో కలిసి ఆయన నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అట్టడుగున నివసిస్తున్న ఆదివాసుల హక్కులకై పోరాడి సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ టి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరాయి ఎల్లం, ఎన్ టి ఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కెమ్మసారం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండి యాదగిరి, కెమ్మసారం సంతోష్, నిమ్మ అశోక్, ఎన్ టి ఎస్ ఎఫ్ అధ్యక్షులు మేడ శ్రీనివాస్, అశ్విని, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు

మాలలకు ఎంపీ స్థానం కేటాయించండి



నవతెలంగాణ-సిద్దిపేట

తెలంగాణలో 3 ఎస్సీ రిజర్వు పార్లమెంట్ స్థానాల్లో బిజెపి పార్టీ ఒక్క స్థానాన్ని కూడా మాలలకు కేటాయించకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు, దళితరత్న జంజీరపు ఎల్లేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మాల మహానాడు ఆధ్వర్యంలో పట్టణంలో పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ వద్ద బిజెపికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎలక్షన్ లో బిజెపి ఓటమి దిశగా మాల మహానాడు పనిచేస్తుందని అన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న మాలల సత్తా చూపిస్తామని, అలాగే బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఓటమి చెందడం ఖాయమని, ఆయన మాలలకు వ్యతిరేకంగా అనేక కార్యక్ర మాలు తీసుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్య దర్శి బొమ్మల విజయ్, పట్టణ అధ్యక్షుడు ముక్క బాబు, యూత్ అధ్యక్షులు బొమ్మల అజయ్, కొండపాక మండల అధ్యక్షులు అమ్ముల నర్సింలు, జిల్లా మాజీ కార్యదర్శి ఎల్లేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి బాబు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం.. మనువాదాన్ని మట్టుపెడదాం



- బీజేపీ పదేళ్ల పాలనలో రిజర్వేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థలకు మంగళం
- సామాజిక అణచివేత, ఆర్థిక దోపిడిపై జమిలీ పోరాటాలు
- సంఘటితమవుతోన్న కార్మిక, కర్షక, సామాజిక శక్తులు
- బీటీ రణదీవే, పూలే, అంబేద్కర్ జయంతి, వర్ధంతి వేడుకలు
- బైక్‌ర్యాలీలు, రక్తదానం, సామాజిక సంఘీభావ కార్యక్రమాలు
- మహనీయుల స్ఫూర్తితో పోరాటాలు: కేవీపీఎస్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

'భారత రాజ్యాంగాన్ని రక్షించుకుందాం....మనువాదాన్ని మట్టుపెడదాం' అనే నినాదం రాజకీయ పోరాటంగా మారింది. దేశంలో బీజేపీ మతోన్మాదం, కార్పొరేట్ అనుకూల విధానాలు, నిరంకుశ పరిపాలన వల్ల విసిగిన సామాజిక శ్రవంతి సమరానికి సిద్ధమవుతుంది. మోడీ పదేళ్ల పాలనలో మతోన్మాద దాడులు పెరిగాయి. రాజ్యాంగానికి ప్రమాదం వాటిల్లింది. రిజర్వేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యమయ్యాయి. దళితులు, మైనార్టీలు, బహుజనులు, మహిళలపై దాడుల పెరిగాయి. బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు, సామాజిక శక్తులు, దళితులు, గిరిజనులు, వృత్తిదారులు సంఘటిత పోరాటాలకు పూనుకున్నారు. బీటీ రణదీవే, జ్యోతిరావు పూలే, డాక్టర్ అంబేద్కర్ సందేశ్ యాత్రలు, సామాజిక న్యాయ పాదయాత్రలు, సదస్సులు, రక్తదాన శిభిరాలు, జన జాతర వంటి కార్యక్రమాలకు సిద్ధమవుతున్నారు. మహనీయుల స్ఫూర్తితో ఆర్థిక దోపిడీ, సామాజిక అణచివేతపై జమిలీ పోరాటాలు సాగిస్తున్నారు.

సామాజిక న్యాయ బైక్ ర్యాలీలు..

రాజ్యాంగాన్ని పూర్తిగా రద్దు చేసి దాని స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని తీసుకొచ్చేందుకు బీజేపీ చేస్తున్న కుట్రల్ని ఎదుర్కొ నేందుకు సామాజిక శ్రేణులు సిద్ధాంతిక పోరాటాలకు సిద్ధమవుతున్నారు. సామాజిక న్యాయం కోసం, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతున్న కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, వృతి సంఘాలు కలిసి ఊరూరా సామాజిక న్యాయ బైక్ ర్యాలీలు నిర్వహించనున్నారు. సదాశివపేట, సంగారెడ్డి, నారాయణఖేడ్, జహీరాబాద్, పటాన్‌చెరు, జోగిపేటతో పాటు మెదక్, నర్సాపూర్, గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల వంటి ప్రాంతాల్లో బైక్ ర్యాలీలు నిర్వహిస్తూ రాజ్యాంగ పరిరక్షణ కోసం సామాజిక వర్గాలను ఐక్యం చేయనున్నారు. ఈ నెల 5న బాబు జగ్జీవన్‌రామ్ 116వ జయంతి మొదలుకుని 11న మహాత్మ జ్యోతిరావు పూలె, 14న డాక్టర్ అంబేద్కర్ జయంతి వేడుకల్ని నిర్వహించనున్నారు. సామాజిక న్యాయ సాధన కోసం మహనీయులు చేసిన త్యాగాల్ని స్మరిస్తూ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఊరూరా మహనీయుల విగ్రహాల వద్ద వేడుకలు నిర్వహించడంతో పాటు మనువాద సిద్ధాంత ప్రమాదం-రాజ్యాంగ పరిరక్షణ గురించి చైతన్య పర్చేలా సదస్సులు నిర్వహించనున్నారు. పలు చోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహిస్తారు. ఆయా కేంద్రాల్లో సహపంక్తి భోజనాలు, శ్రమదానాలు, భారత రాజ్యాంగ విలువను అర్థం చేసుకునేందుకు విద్యార్థులు, మేథావులు చర్చాగోష్టి నిర్వహించనున్నారు. బీజేపీ పదేళ్ల పాలనలో దళితులు, గిరిజనులు, మైనార్టీలు, మహిళలు పట్ల కొనసాగుతున్న దాడులు, దౌర్జన్యాలు పెరిగాయి. మరో పక్క రాజ్యాంగాన్ని రద్దు చేయడం చేసి సామాజిక వర్గాలకు ఏలాంటి హక్కుల్లేకుండా చేస్తున్న కుట్రలను ఎండగట్టేందుకు వివిద రూపాల్లో కార్యక్రమాలు చేపట్టనున్నారు.

సామాజిక సంఘీబావ కార్యక్రమాలు..

కార్మికోద్యమ నేత బీటీ రణదీవె వర్థంతి ఈ నెల 6 నుంచి నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి 14 వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో సామాజిక న్యాయ వారోత్సవాలు నిర్వహించింది. 13, 14 తేదీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా వాక్ ఫర్ సోషల్ జస్టిస్, సామాజిక న్యాయ పాదయాత్రలు, బైక్ ర్యాలీలు నిర్వహించనున్నారు. సామాజిక న్యాయం కోసం భారత రాజ్యాంగాన్ని కాపాడుకునే కర్తవ్యాన్ని కార్మిక వర్గంలోకి తీసుకెళ్లేందుకు వివిద రూపాల్లో కార్యక్రమాలు చేపట్టనున్నారు. సామాజిక సంఘీభావ నిధి వసూల్ కార్యక్రమం నిర్వహించనున్నారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు ఆధ్వర్యంలో ఈ నెల 7న సంగారెడ్డి పట్టణంలో సామాజిక సంఘీబావ నిధిని వసూలు చేశారు. ఆర్థిక దోడిపికి వ్యతిరేకంగా పోరాడడమే కాకుండా సామాజిక న్యాయం కోసం కొట్లాడాల్సిన అవసరముందని కార్మిక వాడల్లో చాటి చెప్పనున్నారు. బీజేపీ అనుసరిస్తూ కార్మిక వ్యతిరేక విధానాల వల్ల రాజ్యాంగం కల్పించిన హక్కులు కాలరాయబడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల వేళ మహనీయుల జయంతి, వర్థంతి వేడుకల సందర్భంగా కార్మికులు పెద్దఎత్తున సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని సీఐటీయూ పిలుపు నిచ్చింది.

మహనీయుల స్ఫూర్తితో మనువాదంపై పోరు



ఏప్రిల్ మాసమంతా మహనీయుల జయంతులు, వర్థంతులున్నాయి. మహనీయులు సాగించిన పోరాట స్ఫూర్తిని స్మరించుకోవడమే కాకుండా మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి. దేశానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రమాదకంగా మారాయి. మనువాదాన్ని తీసుకొచ్చి దేశ ప్రజలపై రుద్దాలని చూస్తున్నాయి. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం లౌకిక, ప్రజాస్వామ్య, సామ్యవాద, సార్వభౌమత్వం, సమాఖ్య విధానాలకు జీవం పోస్తే బీజేపీ మాత్రం మనువాదం పేరిట చాతుర్వర్ణ వ్యవస్థకు జీవం పోయాలని చూస్తుంది. అందుకే మనువాద బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాలి. ప్రభుత్వ రంగ సంస్థల్ని అమ్మేయడం వల్ల రిజర్వేషన్లు పూర్తిగా రద్దు చేయాలని చూస్తుంది. దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీలు, బహుజనులు, అగ్రవర్ణాల్లోని బీజేపీ మతోన్మాదం, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సామాజిక వర్గాలు ఉద్యమించాలి.

– పెద్దాపురం అశోక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి

కాంగ్రెస్ వొచ్చింది.. కరెంట్ పోతుంది

- ఎడ్లు, బండి ఇస్తానని మోసం చేయలే
- నంగునూరు అంటేనే నమ్మకం
- కలెక్టర్ గా ఖ్యాతి ఇచ్చారు. ఎంపీగా ఆశీర్వదించండి
- 100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి యువతకు మేలు చేస్తా
- మెదక్ పార్లమెంటు అభ్యర్థి పి. వెంకట్రామిరెడ్డి

నవతెలంగాణ-నంగునూరు

తొమ్మిది ఏళ్లగా పోని కరెంట్, నేడు కాంగ్రెస్ రాగానే ఎందుకు పోతుందని మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ పి వెంకట్రామిరెడ్డి ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సిద్దన్నపేట శ్రేష్ఠ ఫంక్షన్ హాల్ లో మెదక్ పార్లమెంట్ సన్నాహక సమావేశం నిర్వహించారు.బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆనగోని లింగం గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ రావడంతో నే కరెంట్ పోతుందని, కరువు వొచ్చిందని, కేసీఆర్ పాలన కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు..కలెక్టర్ గా ఖ్యాతి ఇచ్చిన ఈ గడ్డే నాకు రాజకీయ జీవితం కూడా ఇవ్వాలని కోరారు.నేను మీ జిల్లా కలెక్టర్ గా, జాయింట్ కలెక్టర్ గా ఇక్కడ పనిచేయడం జరిగిందని అన్నారు.పార్లమెంటు లో ఒక మాజీ కలెక్టర్ గా మెదక్ ఎంపీ గా అడుగు పెట్టె అవకాశం లభిస్తుండటం నా అదృష్టమన్నారు. పరిపాలనా అనుభవంతో మీ సమస్యల పరిష్కారం కోసం సులువవుతుందన్నారు..కలెక్టర్ గా పనిచేసే సమయంలో నా దగ్గరికి వొచ్చే వాళ్లలో నా తోబుట్టువులను చూశానని, బాధ్యతతో పనిచేయడం జరిగిందన్నారు. మాయ మాటలు నాకు రావు.. మోసం చేయలేదు నేను ఎప్పుడు కూడా అబద్ధం ఆడనని, నిజమే



చెబుతున్నానన్నారు. నేను గతంలో ఎడ్లు ఇస్తానని, బండ్లు ఇస్తానని, నిరుద్యోగ భతి ఇస్తామని, పింఛన్ ఇస్తామని మోసం చేసి ఎమ్మెల్యే గా ఎన్నికై..మోసం చేయలేదన్నారు. అలాగే మొన్నటి ఎన్నికల్లో చిత్తుగా ఓడిపో లేదని రఘునందన్ రావును ఉద్దేశించి చమత్కరించారు..

అటెండర్ కోసం వెంకటేశ్వర స్వామికి తలనీలాలు ఇచ్చా

నేను కలెక్టర్ గా ఉన్నప్పుడు బాబు అనే యువకుడు నా బంగ్లాలో పనిచేసేవాడు..5 ఏళ్ళు నాతో ఉంటూ ప్రేమగా మెదిలేవాడు.. నేను కలెక్టర్ గా రాజీనామా చేసిన తర్వాత గతేడాది మార్చి 2న బాబుకు రోడ్డు ప్రమాదం జరిగిం దన్నారు. బాబు ఆరోగ్యం కోసం రూ.58 లక్షలు ఖర్చు చేశామని.. బాబు బాగు అయిన తర్వాత వెంకటేశ్వర స్వామికి తలనీలాలు ఇచ్చి మొక్కు తీర్చుకోవడం జరిగిందని గుర్తు చేశారు..

బీద మహిళను ఒడ్డున చేర్చా

అలాగే సిద్దిపేట పట్టణానికి చెందిన నిరుపేద మహిళ తన పేదరికం తాళ లేక ఆత్మహత్యాయే దిక్కని రోధించగా, వెళ్లి విచారించి అప్పులు తీర్చడం తో పాటు బట్టల షాప్ ఏర్పాటు చేసి ఆదుకోవడం జరిగిందని, కుమార్తె లకు చదువులు చెప్పించడం జరిగిందన్నారు..ఇల్లు లేక పోవడం తో హరీశ్ రావు దృష్టికి తీసుకెళ్లి డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయడం జరిగిందన్నారు..బద్దిపడగలో సైతం మిషన్ భగీరథ పనులు జరుగుతుండగా..పరిశీలనకు వెళ్లగా, ఇద్దరు అనాధ బాలికల గురించి నా దృష్టికి రాగా అప్పటికప్పుడు తలా లక్ష డిపాజిట్ చేయడం జరిగిందన్నారు..



ట్రస్టు ద్వారా యువతకు అండగా.. నిలుస్తా

నాకు డబ్బు మీద యావ లేదని, పేద ప్రజల సేవ మీదనే నా దృష్టి ఉందన్నారు..నేను చేసే సేవ నా తర్వాత కూడా 50 ఏళ్ళు నా పేరు నిలిచి ఉండేలా అన్నదే నా ధ్యేయమన్నారు..మాది రాష్ట్రంలోనే అతిపెద్ద ఉమ్మడి కుటుంబమని, 30 మంది ఒక్క చోటనే ఉంటామని, ఒక్క దగ్గరే తింటామన్నారు. ఎంపీ గానే కాకుండా..నా ఉమ్మడి కుటుంబ సభ్యుల సహకారంతో 100 కోట్ల తో ట్రస్ట్ ఏర్పాటు చేసి మీకు అండగా ఉంటామన్నారు. యువతీ, యువకులకు కోచింగ్ కేంద్రాలు, వృత్తి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి తర్వాత జాబ్ మేళా వేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు..మహిళలకు సైతం కుట్టు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి అండగా నిలుస్తామన్నారు. నాలాగా పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా వారిని తీర్చిదిద్దుతామ న్నారు.. యువత చెడు దారిలో పడకుండా సరైన దారిలో నడిచేలా చూస్తామన్నారు..బీఆర్ఎస్ పార్టీ కోసం ఎంతో మంది కరుడు గట్టిన కార్యకర్తలు పనిచేస్తున్నారని, ఎంతో పేదరికంలో ఉన్నారని వారిని ఆదుకోవడం జరుగుతుందన్నారు..

బీఆర్ఎస్ కార్యకర్తలు, నిరుపేదల కోసం 7 నియోజకవర్గంలలో ఫంక్షన్ హాళ్లు నిర్మించి కేవలం ఒక్క రూపాయితో వారికి అందిస్తామన్నారు..నా మాట గా ఇంటింటికి చెప్పండి, వెంకట్రామిరెడ్డి ట్రస్టు ఏర్పాటు చేసి ఆదుకుంటాడని,కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని తెలుపాలన్నారు..నంగునూరు మండలం నాకు భారీ ఆధిక్యత ఇవ్వడం ఖాయమని, ఎంపీగా గెలవడం ఖాయమన్నారు. పెద్ద ఎతున తరలొచ్చిన గులాబీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు..

వెంకట్రామిరెడ్డి గెలుపు ఖాయం..
– మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కరువు వొచ్చిందని, ఎంపీ ఎన్నికల్లో మాజీ కలెక్టర్ పి వెంకట్రామరెడ్డి గెలుపు ఖాయమనిమాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి అన్నారు.. నంగు నూరు అంటేనే బీఆర్ఎస్ పార్టీకి ఇలాఖా అని, సిద్దిపేట నియోజకవర్గంలో నంగునూరు మండలం ఎప్పుడు భారీ మెజారిటీ అందిస్తుందన్నారు.నేడు కూడా ఎంపీ అభ్యర్థి వెంకట్రామరెడ్డి కి భారీ మెజారిటీ అందిస్తామన్నారు. కళాంజలి రాజేశ్ బృందం పాడిన పాటలు అలరించాయి. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, జడ్పీటీసీ తడిసిన ఉమా, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మెన్లు ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, సొసైటీ ఛైర్మెన్లు కోల రమేష్ గౌడ్, ఎల్లంకి మహిపాల్ రెడ్డి, రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు బద్దిపడగ కిష్టారెడ్డి, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు గోవిందారం రవి, బిక్షపతి నాయక్, బీఆర్ఎస్ మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు గుడికందుల పద్మ, గంగవ్వ, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కర్ణకంటి రేణుకా వేణు గోపాల్, మండల కోఆప్షన్ సభ్యుడు ఎం.డి.రహీం పాషా, ఎంపీటీసీ బెదురు తిరుపతి, మండలానికి చెందిన తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ,సొసైటి డైరెక్టర్లు బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ అనుబంధ సంఘాల గ్రామ కమిటీల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఉద్యమాలను బలపరచండి

- విరివిరిగా విరాళాలు ఇవ్వండి
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

నవతెలంగాణ-సంగారెడ్డి

సీఐటీయూ మాజీ వ్యవస్థాపక అధ్యక్షులు బి.టి రణదీవే వర్ధంతి ఏప్రిల్ 6 నుంచి అంబేద్కర్ జయంతి వరకు మహనీయుల జయంతి వర్ధంతిల సందర్భంగా సామాజిక సంఘీభావ నిధిని ఆదివారం సంగారెడ్డిలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మహనీయుల జయంతి వర్ధంతి ల సందర్భంగా సామాజిక ఉద్యమాల సంఘీభావనిధిని వసూలు చేసి సామాజిక సంఘాలకు అందిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత బహుజన మైనార్టీల సమస్యలు పరిష్కారం చేయకుండా వారిని ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్న దుస్థితి ఉన్నదన్నారు. దేశంలో నేటికీ కుల వివక్షత, అంటరానితనం, పేదరికం వంటి సమస్యలు



తీవ్రంగా ఉన్నాయన్నారు. పాలకులు వివక్షతను రూపుమాపకుండా చోద్యం చేస్తున్నదన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం దళిత గిరిజన మైనార్టీల పట్ల కక్షపూరితంగా కులం పేరుతో మతం పేరుతో ప్రాంతం పేరుతో దాడులను ప్రోత్సహిస్తుందని మండిపడ్డారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో దళిత బహుజనులు అందరూ తమ ఓటు హక్కు ద్వారా బీజేపీకి బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. బీజేపీని ఎన్నికల్లో ఓడిస్తేనే దేశంలో దళిత బహుజనుల మనుగడ సాధ్యమన్నారు. సామాజిక న్యాయం, మతసామరస్యం, ఆర్థిక సమానత్వం, కుల నిర్మూలన, వంటి లక్ష్యాల సాధన కోసం సీఐటీయూ దేశవ్యాప్తంగా అనేక పోరాటాలను నిర్వహిస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల కూడా కులం పేరుతో మతం పేరుతో విభజించి పాలించాలనే విధంగా చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక ఉద్యమాలకు సీఐటీయూ సంఘీభావంగా అన్ని రకాల తోడ్పాటును భవిష్యత్తులో అందిస్తుందని ప్రత్యక్ష పోరాటాల్లో భాగస్వామ్యం అవుతామన్నారు. ప్రజలు సామాజిక ఉద్యమాలను బలపరిచి విరివిరిగా విరాళాలు ఇచ్చి ప్రజా ఉద్యమాలు బలపరచాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం, కోశాధికారి రాజయ్య, ఉపాధ్యక్షులు ప్రవీణ్, మైపాల్, సహాయ కార్యదర్శి యాదగిరి, విద్యాసాగర్, రాజిరెడ్డి, పాండురంగారెడ్డి, బాబురావు, సురేష్, నాగేశ్వరరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ఉగాది పురస్కారం అందుకున్న తిరుపతయ్య చారి

నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో అర్చకునిగా పనిచేస్తున్న పానుగంటి తిరుపతి చారి, విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం సిద్దిపేట జిల్లా ఉగాది మహోత్సవ పండిత పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం ఆధ్వర్యంలో పురస్కారాన్ని తిరుపతి చారి కి అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బాల బ్రహ్మాచారి, ఉపాధ్యక్షులు విష్ణుమూర్తిచారి, కార్యదర్శి ప్రభాకర్ చారి, తదితరులు పాల్గొన్నారు

మట్టి స్నానంతో ఆరోగ్యానికి మేలు

నవతెలంగాణ-సిద్దిపేట

మట్టి స్నానంతో వివిధ రకాల వ్యాధులను దూరం చేసే అవకాశం ఉంటుందని ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.ఎస్ స్వామి అన్నారు. పట్టణంలోని చంద్రమౌళీ గార్డెన్ లో ఆదివారం వ్యాస మహర్షి యోగ సొసైటీ ఆధ్వర్యంలో మట్టి స్నాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాస్త్రం కూడా ఈ విషయాన్ని నిర్ధారిస్తుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ యోగా రామిరెడ్డి మాట్లాడారు. ప్రముఖ యోగ శిక్షకులు తోట సతీష్ ఆధ్వర్యంలో మట్టి లేపనంతో సాధకులు యోగ సాధన చేశారు. వివిధ ఆయుర్వేద వనమూలికలు కలిపి ప్రత్యేకమైన మట్టిని తయారు చేశారు. దాదాపు ఇందులో 100 మంది సాధకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి , సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట



అశోక్ , గౌరవాధ్యక్షులు కే. అంజయ్య, గంగాపురం శ్రీనివాస్, బసవరాజు కుమార్, పల్లె సురేష్ , రాజమల్లయ్య , వేణు, భారత స్వాభిమాన్ ట్రస్ట్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ రంగాచారి, సిద్దిపేట జిల్లా భారత స్వాభిమాన్ ట్రస్ట్ సభ్యులు రాములు, వాసు తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు ద్రోహం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-సంగారెడ్డి

మాదిగలకు ద్రోహం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఖబర్దార్ అంటూ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మైసగళ్ళ బుచ్చేంద్ర మాదిగ హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు ద్రోహం చేస్తున్నదంటూ ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సంగారెడ్డి ప్రధాన రహదారి పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా బుచ్చేంద్ర మాదిగ మాట్లాడుతూ.. కాంగ్రెస్ మాదిగలకే కాదు బీసీలకు కూడా అన్యాయం చేసిం దన్నారు. 4శాతం లేని రెడ్లకు 6 స్థానాలు కేటాయించి, 50శాతం ఉన్న బీసీలకు 2 స్థానాలు, మాదిగలకు గుండు 'సున్నా' పెట్టిందన్నారు. ప్రచారాల్లో ప్రజా ప్రభుత్వం అంటున్న కాంగ్రెస్.. ఆ మెజార్టీ వర్గాల ప్రజలకే అవకాశాలు దక్కనీ యకుండా చేయడాన్ని ఏమనాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ పునరాలోచన చేయా ల ని.. మూడు ఎస్సీ పార్లమెంట్ స్థానాల్లో రెండు స్థానాలను



మాదిగలకే కేటాయి ంచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తమ విధానాలను మార్చుకోకపోతే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఎస్ రాష్ట్ర నా యకురాలు పెద్ద గీత మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి ప్రసాద్ మాదిగ, ఎం ఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు కవిత మాదిగ, వీరయ్య మాదిగ, మహేష్ మాది గ, పల్లవి మహాజన్, అనిల్‌మాదిగ, శివకుమార్ మాదిగ పాల్గొన్నారు.

కేంద్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే..



నవతెలంగాణ-జహీరాబాద్

కేంద్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని.. కాబట్టి కార్యకర్తలు అధైర్యప డకుండా పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు నకు కృషి చేయాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి ఎంపీ బీ.బి పాటిల్ అన్నారు. పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం ఏర్పాటు కార్యక్రమంలో వివిధ పార్టీల నుంచి పలువురు బి.బి పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. బీజేపీలో చేరిన నాయకులకు కండువాలు వేసి పాటిల్ సాదరంగా ఆహ్వా నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్ రెడ్డి, పాండురంగారెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

అటెండర్ తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-జహీరాబాద్

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం అటెండర్ అనిల్ తండ్రి అనారోగ్యం తో మృతి చెందాడు. ఈ విషయం తెల్సుకున్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు ఆదివారం న్యాల్కల్ మండలంలోని మామిడ్గి గ్రామంలో మృతుని నివాసానికి వెళ్లి.. మృతదేహానికి నివాళ్లర్పించాడు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి.. అనంతరం మృతుని అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యేతోపాటు మాజీ సర్పంచ్ చంద్రం, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.



జర్నలిస్టు కుటుంబాన్ని పరామర్శించిన తన్వీర్

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని మున్సిఫ్ నియోజకవర్గం రిపోర్టర్ మహమ్మద్ అక్రమ్ పటేల్ తల్లి శుక్రవారం మృతి చెందింది. ఈ విషయాన్ని తెలుసుకున్న టీఎస్ ఐడీసీ మాజీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్ ఆదిఆరం రోజున జర్నలిస్టు సంఘాల నాయకులతో కలిసి అక్రమ్ పటేల్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనతోపాటు నాయకులు మహమ్మద్ కుతుబుద్దీన్, సందీప్, మహమ్మద్ నసీర్, బజార్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

నిర్వాహణ మరిచిన పాలక వర్గాలు

నవతెలంగాణ-మునిపల్లి

యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందింపజేసి గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన క్రీడాకారులను తయారు చేయడం కోసం యువతలో ఉత్సాహాన్ని నింపేందుకుగాను గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగం మారుతున్నాయి. గ్రామపంచాయతీ పాలకవర్గం వాటి నిర్వహణను మరిచిపోవడంతో పాటు ఉపయోగంలోకి తీసుకరావడం లేదు. దాంతో క్రీడా ప్రాంగణాలు కేవలం పేరుకే మాత్రమే పరిమితం అయ్యాయి.

ఉపాధి హామీ చట్టం కింద ప్రతీ గ్రామీణ ప్రాంతంలో క్రీడకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం లక్షల ఖర్చుతో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ప్రతీ గ్రామ పంచాయతీకి రెండున్నర లక్షల వ్యయాన్ని వెచ్చించి గ్రామీణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుతం చాలా గ్రామాల్లో అవి నిరుపయోగంలో ఉన్నాయి. అధికారులు సరైన స్థలం ఎంపిక చేయడంలో విఫలవ్వడంతోనే అవి నిరుపయోగంగా మారినట్టు పలువురు ఆరోపిస్తున్నారు. నామమాత్రంగా క్రీడా ప్రాగాణం బోర్డు, వాలీబాల్, కో కో కోట్లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారన్నారని మండిపడుతున్నారు. వాస్తవానికి అందులో అన్ని వయసుల వారికి ఉపయోగపడే విధంగా అన్ని రకాల క్రీడా సామాగ్రి అందుబాటులో ఉంచటంతో పాటు వాకింగ్ ట్రాక్, పిల్లల అట వస్తువులు, బెంచీలు ఏర్పాటు చేయాలి. కానీ సరైన స్థలాల్లో ఏర్పాటు చేయకపోవడంతో.. లక్షలు వెచ్చించిన పథకం నీరుగారి పోతోంది. క్రీడా ప్రాణంలో పిచ్చి మొక్కలు పెరిగి దుర్వినియోగంగా మారాయి. కాగా లక్షల ఖర్చు చేసింది కాంట్రాక్టర్లకు జేబులు నిండడానికి మాత్రమేనని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి క్రీడా ప్రాంగణాన్ని ఉపయోగంలోకి తేవాలని కోరుతున్నారు.



కాంట్రాక్టర్లకు మాత్రమే లాభం చేకూరింది



మండలంలోని క్రీడా ప్రాంగణం వల్ల ఏ గ్రామ యువతకు ఉపయోగం లేదు. వీటి నిర్మాణం ద్వారా కేవలం కాంట్రాక్టర్లకు మాత్రమే లాభం చేకూరింది. కొన్నిచోట్ల క్రీడా ప్రాంగణాలు తాగుబోతులకు అడ్డగా మారాయి. వెంటనే అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలను అందుబాటులోకి తేవాలి.

– రమేష్ యాదవ్, తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర కమిటీ సభ్యుడు

నేడు కల్హేర్, పెద్దశంకరంపేట బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం



నవతెలంగాణ-కల్హేర్

కల్హేర్ మండలంలోని మాసన్‌పల్లి ఎన్‌హెచ్ 161 జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న వెంకటాద్రి ఫంక్షన్ హాల్‌లో నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి అధ్యక్షతన నేడు (సోమవారం) కల్హేర్, పెద్దశంకరంపేట బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతా రన్నారు. కాబట్టి కల్హేర్, పెద్దశంకరంపేట రెండు మండలాల పరిధిలోని బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ మండలాధ్యక్షులు, మార్కెట్ డైరెక్టర్లు, ఆత్మ చైర్మెన్ మరియు డైరెక్టర్లు, రైతు సమన్వయ సమితి కో-ఆర్డినేటర్, మండల పార్టీ యువత అధ్యక్షులు, మండల పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, పీఏసీఎస్ చైర్మెన్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంస్థ అధ్యక్షులు మరియు కార్యవర్గ సభ్యులు, అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.



బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు..

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని మాదారం గ్రామానికి చెందిన సుదర్శన్ బృందం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినట్టు పార్టీ మండలాధ్యక్షులు వడ్డే కృష్ణ తెలిపారు. ఈ మేరకు వారికి కాటా శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విధానాలకు ఆకర్షితులై యువత పార్టీలో చేరడం పట్ల పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ యువతను అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్ రెడ్డి, జిన్నారం మండల పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మాదారం కలాలి రాజు గౌడ్, జిన్నారం మండలం కాంగ్రెస్ నాయకులు, మాదారం యువకులు పాల్గొన్నారు.

గీతం స్కాలర్ జపమాల రాణికి పీహెచ్‌డీ



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ హైదరాబాద్‌లోని గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని బి.జపమాల రాణిని డాక్టరేట్ వరించింది. 'సాధారణీకరించిన కుంభాకారం ద్వారా విరామం-విలువ ప్రోగ్రామింగ్ సమస్యల అధ్యయనం'పై ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గణిత శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణ కుమ్మరి ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. రేఖ సిద్ధాంత వ్యాసం, సర్వోత్తమీకరణం సమస్య అనిశ్చితి డేటాను పరిష్కరించడానికి సాంకేతికతలను పరిచయం చేసిందని తెలిపారు. లాంగ్రాజ్ ఫంక్షన్ సాడిల్ పాయింట్ పరిస్థితులు వివిధ రకాల విరామం-విలువ ప్రోగ్రామింగ్ సమస్యలతో పాటు పరిష్కారాలు, వాటి నిర్మాణ లక్షణాలను కూడా పరిశీలించినట్టు డాక్టర్ కృష్ణ వివరించారు. జపమాల రాణి సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్ డి పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం శ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్చార్జి ప్రిన్సిపాల్, గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం. రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురుఈ సందర్భంగా ఆమెను అభినందించారు.



నిరుద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-సదాశివపేట

నిరుద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని మండల పరిధిలోని అంకేనపల్లి గ్రామంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నిరుద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పి.రవీందర్, ఉపాధ్య క్షుడిగా భగవాన్ రావు, ప్రధాన కార్యదర్శిగా గొల్ల రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శివరాజ్ పాటిల్, సంయుక్త కార్యదర్శిగా పి మల్లేశం,కోశాధికారిగా శివప్రసాద్, జాయింట్ సెక్రెటరీ గురు పాదంను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో బి.శ్రీశైలం, రాజు, మల్లేశంమోహన్, పి.రంజిత్ రెడ్డి, జి.శ్రీనివాస్ గౌడ్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ.. ప్రయివేటు రంగంలో 75శాతం ఉద్యోగాలు స్థానికులకే వచ్చేలా కృషి చేస్తామ న్నారు. స్థానిక పరిశ్రమల్లో స్థానికులకు కాకుండా స్థానికేతరులకు ఉద్యోగాలు ఇస్తూ, స్థానికులకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. జిల్లాలో వందల సంఖ్య లో పరిశ్రమలు ఏర్పాటు చేసిన స్థానికులకు ఉద్యోగాలు కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా ప్రస్తుత ప్రభుత్వం కూడా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటుచేసి స్థానిక యువకులకు నైపుణ్యం పెంపొందించి తగు పరిశ్రమంలో ఉపాధి కల్పించాలని నిరుద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షులు రవీందర్ తెలిపారు.

మేశాసంఘం అంబేద్కర్ సంఘం నూతన కమిటీ ఏర్పాటు




నవతెలంగాణ-మునిపల్లి

మండంలోని మేశాసంఘం అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని ఆదివారం ఏర్పాటు చేశారు. ప్రతీయేడు ఏప్రిల్ మాసంలో నూతన కమిటీని ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఈ నేపథ్యంలో ఈ యేడు కూడా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా బ్యాగరి నర్సింలు, ఉపాధ్యక్షు డిగా ఏర్పుల పెంటయ్యను ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు, ఉపా ధ్యక్షుడు ప్రమాణం చేస్తూ.. ఏ భేదం లేకుండా అందరినీ కలుపుకొని పోతావ ఎన్నారు. బేధాభిప్రాయాలు చూపకుండా ఐక్యమత్యంతో అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తూ అంబేద్కర్ యువజన సంఘాన్ని మరింత బలపరు స్తామంటూ భారత రాజ్యాంగంపై ప్రమాణం చేస్తున్నామన్నారు. అనంతరం ఏప్రిల్ 14 రోజు ఏర్పాటు చేయాల్సిన కార్యక్రమాలను గూర్చి గ్రామంలో జరుగుతున్న మంచిచెడు కార్యక్రమాల్లో అంబేద్కర్ సంఘం సభ్యులు చేయాల్సిన కార్యక్రమాలు బాధ్యతలను గురించి సంఘ సభ్యులతో కలిసి సంభాషించి సభ్యులందరూ ఏకకంఠంగా ఏకీభవించారు. మేశాసంఘం అంబేద్కర్ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, కుల నాయకులు నూతన కమిటీని బలపరుస్తూ అభినందించారు.



రాజ్యాంగ రక్షణ యాత్రకు ఘన స్వాగతం

నవతెలంగాణ-సంగారెడ్డి

మాలమహానాడు జాతీయ అధ్యక్షులు డా.అద్దంకి దయాకర్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2నుంచి 8వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న 'రాజ్యాంగ రక్షణ యాత్ర' ఆదివారం సంగారెడ్డికి చేరుకున్నది.ఈ యాత్రకు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు నీరుడు ఆంజనేయులు ఘన స్వాగతం పలికారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ మాట్లాడుతూ.. రాజ్యాంగ రక్షణ కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో డీబీఎస్ నాయకులు శంకర్, జిల్లా ఇంచార్జిశివ, మాల మహానాడు నాయకులు కుమార్,శంకర్, భాను, ప్రసాద్, వీరేశం, వినయ్‌కుమార్, ఉదయ్,రవి తదితరులు పాల్గొన్నారు.

పదవీ కాలం ముగిసినా.. ప్రజలతోనే

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్న మొద్దుంపల్లి మాజీ సర్పంచ్



నవతెలంగాణ-మునిపల్లి

పదవి కాలం ముగిసినా.. నిత్యం ప్రజలతో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి మొద్దుంపల్లి మాజీ సర్పంచ్ అశోక్ కృషి చేస్తున్నారు. గ్రామంలో ఏ సమస్య వచ్చిన వెంటనే స్పందించి.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గత పదేండ్లుగా సర్పంచ్‌గా కొనసాగిన ఆయన.. పదవి కాలం తర్వాత కూడా ప్రజల్లో ఉంటూ సేవ చేయడాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు. ఇటీవ లే గ్రామంలో మంచి నీళ్ల పైపులైన్ పగిపోయి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాంతో మాజీ సర్పంచ్ అశోక్ వెంటనే స్పందించి.. పైపు లైన్ బాగుచేయించారు. దాంతో ప్రజలకు నీటి ఎద్దడి బాధ తప్పింది. కాగా ఆయన సర్పంచ్‌గా ఉన్న పుటి నుంచే నిత్యం ప్రజా సేవ లో ఉండేవారని గ్రామస్తులు చెబుతున్నారు. ఏ సమస్య వచ్చినా..ఆయన్ను కలవగానే పరిష్కారానికి కృషి చేసేవారని గుర్తు చేస్తున్నారు.

అభివృద్ధిలో మా గ్రామం ముందుంది

మా గ్రామం అభివృద్ధిలో ముందు ంది. 960 జనాభా 660 ఓటర్లు గల మా గ్రామంలో సుమారు 260రేషన్ కార్డులు ఉన్నాయి. గ్రామంలోని 8 వార్డుల్లో సీసీరోడ్లు, మురికి కాల్వలు నిర్మిం చుకున్నాం. మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందు తున్నది. స్మశానవాటిక, డంపింగ్ యార్డ్, ప్రకృతి వనం, క్రీడా ప్రాగణం నిర్మించుకున్నాం. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేయడం నా బాధ్యత.

– అశోక్ , మాజీ గ్రామ సర్పంచ్

అన్ని అన్ని వర్గాల సంక్షేమానికి ఫరీదుద్దీన్ కృషి



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అన్ని వర్గాల సంక్షేమానికి మాజీ మంత్రి ఫరీదొద్దిన్ చేసిన కృషి అభినందనీయమని మాజీ హెూం మంత్రి మహమూద్ అలీ అన్నారు. పట్టణంలోని ఎస్ కన్వెన్షన్‌లో టీఎస్ఐడీసీ మాజీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథిగా మహమూద్ అలీ హాజరై మాట్లాడారు. ఫరీదొద్దిన్ మృతి చెందినా.. ఆయన కుమారుడు కూడా అదే బాటలో ప్రజలకు సేవలు అందిస్తూ అన్ని వర్గాల వారి మన్ననలు పొందుతున్నారన్నారు. మహమ్మద్ తన్వీర్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పెద్ద సంఖ్యలో అన్ని వర్గాలకు చెందిన ప్రజలు పాల్గొనడం ఎంతో అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు మాజీ చైర్మెన్ నరోత్తం, దేవి ప్రసాద్, మటమ్ శ్రీనివాస్, శివకుమార్, షేక్ ఫరీద్, అల్లాడి నర్సింలు, తట్టు నారాయణ ,విజయకుమార్, శ్రీకాంత్ రెడ్డి, వీరారెడ్డి, ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్, హనుమాన్ కుతుపోద్దీన్ షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్య బైక్ ర్యాలీలను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

అంబేద్కర్ పూలే జయంతుల సందర్భంగా నిర్వహించ తలపెట్టిన సామాజిక చైతన్య బైక్ ర్యాలీలను జయప్రదం చేయాలని సామాజిక ప్రజా సంఘాల పిలుపునిచ్చాయి. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, కల్లుగీత కార్మిక సంఘం, ప్రజానాట్య మండలి, ఆవాజ్, సంఘాల సమావేశాన్ని ఆదివారం స్థానిక కేకే భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్, కేజీకెఎస్ జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్, పీఎస్ఎం జిల్లా కార్యదర్శి నాగభూషణం, ఆవాజ్ సంఘం జిల్లా నాయకులు ఎండి. ఖయ్యూం లు మాట్లాడుతూ.. ఏప్రిల్ నెల మహనీయుల మాసంగా జరుపుకుందామన్నారు. ఈ నెలలోనే పూలే, అంబేద్కర్ జన్మించారన్నారు. సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిబాపూలే విద్య, మహిళా జాతి విముక్తి కోసం పోరాడిన మహనీయుడని.. అలాగే డాక్టర్ బి.ఆర్అంబేద్కర్ కులవివక్ష అంటరానితనంపై అసమానతలపై పోరాడిన మహనీయుడన్నారు. కాబట్టి వారి జయంతులను ఘనంగా నిర్వహించుకోవాలని.. వారు చేసిన త్యాగాలను పోరా టాలను గుర్తు చేసుకుంటూ ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా సామాజిక చైతన్య బైక్ ర్యాలీలు నిర్వ హించనున్నట్టు తెలిపారు. అందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్ నాయకులు మహేష్, సుధా కర్, దత్తు, బాబురావు, సురేష్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అల్మాయిపేటలో మినరల్ వాటర్‌తో చలివేంద్రం ఏర్పాటు



నవతెలంగాణ-జోగిపేట

జాతీయ రహదారి 161 అకోలా-నాందేడ్ రహదారిపై మండల పరిధిలోని అల్మాయిపేట గ్రామ శివారులో బీఆర్ఎస్ యువ నాయకులు, రాజన్న యువసేన, రవిశంకర్ మిత్రబృందం ఆధ్వర్యంలో మినరల్ వాటర్‌తో కూడిన చలివేంద్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎండాకాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రజలు ఈ చలివేంద్రాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో రహదారిపై వెళ్లే ద్విచక్ర వాహనదారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బీరప్ప, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు వెంకటరెడ్డి, మాజీ వార్డు సభ్యులు రమేష్, వీరేశం, రాయిని రాములు, సీ హెచ్. మల్లేశం , దండు చెన్నయ్య, రాజన్న యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ రుక్మిణీ పాండురంగడి వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-రాయికోడ్

మండల కేంద్రమైన రాయికోడ్‌లో శ్రీరుక్మిణి పాండురంగడి ఆలయ 13వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరుక్మిణిపాండురంగడికి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉత్సవ విగ్రహాలను ఉంచి, డప్పుచప్పుళ్ల మధ్య పిల్లలు, పెద్దలు, యువకులు నృత్యాలు చేస్తూ, భజన చేసుకుంటూ మహిళలు నిండు కలశాలను ఎత్తుకుని గ్రామ పురవిధులగుండా వైభవంగా శోభాయాత్ర ను నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను కలశలలోని జలాలతో అభిషేకం చేసి,పూజాకార్యక్రమాలు నిర్వహించి మహా హారతిని ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నారాయణ పంతులు, సభ్యులు కృష్ణ, పండరి, రాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



కాజిపల్లి ఇఫ్తార్‌లో కాటా

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని కాజిపల్లి గ్రామంలో వాహబ్ రవుఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఇఫ్తార్ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ పటాన్చెరువు ఇన్చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్, బొల్లారం కౌన్సిలర్ చంద్రారెడ్డి, వరప్రసాద్ రెడ్డి, బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్ రెడ్డి, పిసిసి ప్రతినిధి కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, జైపాల్ రెడ్డి జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్‌రెడ్డి, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మాదారం కలాలి రాజు గౌడ్, జిన్నారం మండలం కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ నేతలు ముస్లిం సోదరులు యువకులు పాల్గొన్నారు

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం : వ్యక్తికి గాయాలు



నవతెలంగాణ-మిరు దొడ్డి

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన అక్బరుపేట భూంపల్లి మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం అక్బర్ పేట భుంపల్లి మండలం జంగాపల్లి గ్రామానికి చెందిన అంతటి మల్లేశం, స్వామి ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై వీరారెడ్డిపల్లి నుంచి ఖాజీపూర్ వైపుగా వెళ్తున్న క్రమంలో రైస్ మిల్ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అక్కడి స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా దౌల్తాబాద్ 108 అంబులెన్స్ సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ భాను,పైలట్ జనార్ధన్ అక్కడికి చేరుకొని ప్రథమ చికిత్స అందించి స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ సిద్దిపేటకు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్థన్, జిల్లా కోఆర్డినేటర్ వెంకటేష్‌లు మాట్లాడుతూ మెడికల్ ఎమర్జెన్సీ అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

మత సమారస్యానికి ప్రతీక రంజాన్ ఉపవాస దీక్షలు



నవతెలంగాణ-వర్గల్

మండలంలోని మక్త మైలారం గ్రామంలో ఇఫ్తార్ విందులో మాజీ ఎఫ్డిసి చెర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. సాయంత్రం ఉపవాస దీక్ష ముగిసే సమయంలో ముస్లిం సోదరులు పండ్లను అందజేసి ఉపవాస దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీకి కేసీఆర్ పెద్దపీట వేశారన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ సందర్భంగా కానుక అందించె వారని గుర్తుచేశారు. ముస్లిం సోదరులతో కలసి ఇఫ్తార్ విందులో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ విందులో మైనారిటీ నాయకులు యూసఫ్ జానీ, ఎంపీ లతా రమేష్ గౌడ్, జెడ్పిటిసి బాలమల్లు, సర్పంచ్ మంజుల కృష్ణ, ఎంపీటీసీ సాజనిత బిక్షపతి రెడ్డి, బ్రహ్మం, బీసీ సెల్ అధ్యక్షుడు మురళీ గౌడ్, శౌకథ్,హస్నొద్దిన్, నాజిమొద్దిన్ , గ్రామ మైనార్టీ నాయకులు గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రజావాణి రద్దు

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-మెదక్

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున ఈ నెల 8న సోమవారం జరగాల్సిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికముగా వాయిదా వేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

భూ లక్ష్మమ్మ జాతర ఉత్సవాల్లో పాల్గొన్న నవీన్ గుప్తా



నవతెలంగాణ-నర్సాపూర్

మండల కేంద్రమైన శివంపేటలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భూ లక్ష్మమ్మ జాతర ఉత్సవాల్లో ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నవీన్ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ లక్ష్మమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వరాల గణేష్, గంగపుత్ర సంఘం అధ్యక్షులు నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మోడల్ ప్రవేశ పరీక్ష



నవతెలంగాణ- చేగుంట

చేగుంట మండల కేంద్రం సీఎంఆర్ కాలనీలో ఉన్న తెలంగాణ స్టేట్ మోడల్ పాఠశాలలో ఆరవ తరగతి అర్హత పరీక్ష ఆదివారం నిర్వహించారు. వివిధ పాఠశాలలో ఐదవ తరగతి చదువుకున్న విద్యార్థులు సుమారు 340 మంది దరఖాస్తు చేసుకొని ఆదివారం జరిగిన ఈ అర్హత పరీక్షకు విద్యార్థులు తమ హాల్ టికెట్లతో హాజరై పరీక్ష రాశారు. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో ఏ. సెంటర్, బి.సెంటర్‌ను, రెండు సెంటర్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశారు. అలాగే మధ్యాహ్నం ఏడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు అర్హత పరీక్ష నిర్వహించారు. మొత్తం ఆరవ తరగతి అర్హత పరీక్షలో 340 మందికి, ఏ. సెంటర్లో 21 మంది, బి .సెంటర్లో 8 మంది, గైర్హాజర్ అయ్యారు. సిఎస్ గంగాబాయ్, గౌస్ మైనుద్దీన్, డివోలు నీరజ, లీలావతిల ఆధ్వర్యంలో ఈ అర్హత పరీక్ష నిర్వహించారు.

మైనార్టీలకు కాంగ్రెస్ అండగా ఉంటుంది

- మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు



నవతెలంగాణ- గజ్వేల్

రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కృషి చేస్తున్నారని మెదక్ కాంగ్రెస్ పార్లమెంటు అభ్యర్థి నీల మధు అన్నారు. ఆదివారం సాయంత్రం గజ్వేల్ పట్టణంలో మదీనా మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొని అనంతరం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందని దేశంలో కూడా రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. ఎన్నడూ లేని విధంగా మైనారిటీలకు కేంద్రంలో అధికారంలోకి రాగానే రాహుల్ గాంధీ భారీ బడ్జెట్‌ను ఏర్పాటు చేయబోతున్నారని ఆయన చెప్పారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. మెదక్ పార్లమెంటు పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని తనను పార్లమెంటు ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ 100 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీ మైనార్టీలకు అండగా ఉంటుందని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి మైనార్టీలు సైతం అండగా నిలుస్తూ రాష్ట్రంలో అధికారం కోసం చేయూత ఇచ్చారన్నారు. దేశంలో కూడా కాంగ్రెస్ రావడానికి మైనార్టీలు ముందుకు వస్తున్నారన్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో బీ జే పీ, బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. మైనార్టీల అందరూ కాంగ్రెస్ వైపు ఉన్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, ఆరేపల్లి మోహన్, మెదక్ పార్లమెంటు ఇంచార్జి ప్రమోద్ కుమార్, నాయకులు ఖైయూము, మహిళా యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు తూముకుంట అంక్షారెడ్డి, మైనార్టీ నాయకులు సర్దార్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు రవీందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మోహన్, గజ్వేల్ పార్టీ నాయకులు నక్క రాములు గౌడ్, రాజు, అజ్గర్, సురేష్, నాగరాజుగౌడ్, మామిడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీవితాంతం ప్రజాసేవలోనే ఉంటా

- మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న హరీశ్ రావు, వెంకట్రామిరెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట

జీవితాంతం ప్రజాసేవలో ఉంటానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని నిమ్రా గార్డెన్‌లో ఆదివారం జరిగిన దావతే ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సిద్దిపేట గంగా జమున తహజీబ్‌కు కేంద్ర బిందువన్నారు. నాటి ఎమ్మెల్యేలు మదన్మోహన్, కేసీఆర్ కాలం నుంచే ఇక్కడి ప్రజలు సోదరభావంతో కలిసి మెలిసి ఉంటారని అన్నారు. సిద్దిపేట అన్ని రంగాల్లో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.రాష్ట్రంలోనే తొలిసారిగా ఆఖరి సఫర్ అనే అంతిమ యాత్ర వాహనాన్ని సిద్దిపేటలోనే అందుబాటులోకి తేవడంతో పాటు, డెడ్ బాడీలను నిల్వ ఉంచడానికి అన్ని మస్జిద్‌లలో ఫ్రీజర్లను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. తప సొంత డబ్బులతో సిద్దిపేట ముస్లింల కోసం ఎన్సాన్పల్లిలో మూడు ఎకరాల భూమిని కొనుగోలు చేసి, బోరు మోటర్‌ను వేసి, పెన్సిలింగ్ చేసి గేటు పెట్టి ఇచ్చానన్నారు. నేడు ఆ భూమికి కోట్ల విలువ వచ్చిందన్నారు. నిరుపేద ముస్లిం మహిళల ఉపాధి పొందాలన్నా లక్ష్యంతో తాను సొంతంగా కుట్టు మిషన్లను అందించానని, ప్రతి ఏటా తన సొంత డబ్బులతో పదిమంది నిరుపేదలకు ఉమ్రయాత్రకు పంపిస్తున్నానన్నారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉండడంతో పండుగ రోజున నమాజు వేళలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా సిద్దిపేట మున్సిపల్ పాలకవర్గం సహకారంతో పూర్తి సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇఫ్తార్ విందులో మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, తంజీం ప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు అబ్దుల్ సమీ, ఆసిఫ్, అబ్దుల్ వహీద్, జావీద్, తహెర్, ప్రజా ప్రతినిధులు, నాయకులు కడవేరు రాజానర్సు, వేలేటి రాధాకృష్ణ శర్మ గుండు భూపేష్, పాల సాయిరాం, మచ్చ వేణుగోపాల్ రెడ్డి, వజీరుద్దీన్, ఫక్రుద్దీన్, మోయిజ్ , నాగరాజు రెడ్డి, మల్లికార్జున్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బీజేవైఎం మండల అధ్యక్షునిగా సదానంద రెడ్డి



నవతెలంగాణ-మిరు దొడ్డి

దుబ్బాక నియోజకవర్గంలోని మిరుదొడ్డి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు దేవరాజు ఆధ్వర్యంలో పలువురికి పదవి బాధ్యతలు అప్పగించారు. బీజేవైఎం మండల అధ్యక్షునిగా సదానంద రెడ్డి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా పిట్ల రవి ఓబీసీ మోర్చా మండలం అధ్యక్షులుగా అశోక్‌ను నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారు మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయానికి తమ వంతుగా కృషి చేస్తామని వెల్లడించారు. తమకు బాధ్యతలు రావడానికి కృషి చేసిన కార్యకర్తలతో పాటు బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్ రావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించాలి

- కొనుగోలు కేంద్రాలతో రైతులకు గిట్టుబాటు ధర
- సొమ్మక్కపెట సొసైటీ సీఈవో పోచయ్య

నవతెలంగాణ-చిలిపిచేడ్

రైతులు కొనుగోలు కేంద్రాలలోనే రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించాలని సోమక్కపేట సొసైటీ సీఈవో పోచయ్య అన్నారు. ఆదివారం మెదక్ జిల్లా కలెక్టర్ అదేశాల మేరకు సోమక్కపేట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యము కొనుగోలు కేంద్రాలను సోమక్కపేట్, అజ్జమర్రి, బండపోతుంగల్, ఫైజాబాద్, జగ్గంపేట, చండూర్, చిలిపిచేడ్, చిట్కుల్, రాందాసుగుడా, గౌతపూర్ గ్రామాల్లో ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళారులను నమ్మి మోసపోవద్దని, రైతులు కొనుగోలు కేంద్రాలలోనే తమ ధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర అందిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది నర్సింలు, దత్తు, రాజు, గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.





నవతెలంగాణ -వెల్దుర్తి

రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని విక్రయించాలని తహశీల్దార్ తులసి రామ్ అన్నారు. ఆదివారం ఉమ్మడి మాసాయిపేట్ వెల్దుర్తి మండలాల్లో పిఎసిఎస్ ఆధ్వర్యంలో 21 కొనుగోలు కేంద్రాలను పిఎసిఎస్ సిబ్బంది వ్యవసాయ అధికారులు ఏవో ఝాన్సీ రాజశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. మాసాయిపేట మండల కేంద్రంలో 4 కొనుగోలు కేంద్రాలు వెల్దుర్తి మండల కేంద్రంలో 17 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు ఆరుగాలం పండించిన పంటలు దళారులకు అమ్మి మోసపోకుండా ఉండేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి రైతు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రలలోనే ధాన్యాన్ని విక్రయించి సొమ్ము చేసుకోవాలని సూచించారు. రైతులకు మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి 2203. బి గ్రేడ్ రకానికి 2183 చెల్లిస్తుందన్నారు. తూకం వేసిన వారం రోజుల్లోపే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సీఈవో సిద్దయ్య వ్యవసాయ అధికారిని ఝాన్సీ రాజశేఖర్ పిఎసిఎస్ సిబ్బంది ఉన్నారు.

ఎన్నికలవేళ బెల్ట్ షాపులు ఫుల్ జోష్

- దాబాలలో అధిక ధరలకు మద్యం అమ్మకాలు
- అధికంగామద్యం సేవిస్తున్న మద్యం ప్రియులు
- బెల్ట్ షాపులను పట్టించుకోని ఎక్సైజ్ శాఖ

నవతెలంగాణ-నిజాంపేట

కేంద్ర ఎన్నికల అధికారి ఒకపక్క ఎన్నికల షెడ్యూలు విడుదల చేసినప్పటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందంటూ చెప్పినప్పటికీ అధికారులు కొందరు పెడచెవిన పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని గ్రామాలలో ఎక్కడ చూసినా బెల్ట్ షాప్ లు, దాబాలు దర్శనమిస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఉదయము 7 గంటల నుంచి రాత్రి 1 గంట వరకు బెల్ట్ షాపులు దాబాలు నడుస్తున్నాయని, యజమానులకు మాత్రం కాసుల వర్షం కురిపిస్తున్నాయని చెప్పొచ్చు. విచ్చలవిడిగా మద్యం సేవిస్తూ గ్రామాలలో ప్రమాదాలకు కారకులవుతున్నారు. బెల్ట్ షాపులను దాబాలను బందు చేయాలని ఎన్నికల అధికారులు చెప్పినప్పటికీ కిందిస్థాయి అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెల్ట్ షాపులు దాబాలలో ఇదే మాదిరిగా మద్యం విక్రయాలు కొనసాగినట్లయితే మద్యం సేవించి ఓటు ఎటు వేస్తారో ఏమో తెలియని పరిస్థితి. ప్రజాస్వామ్యానికి ఓటు గొడ్డలిపెట్టు అని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే మద్యాన్ని అదుపులో పెట్టవలసిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బెల్టు షాపులు, దాబాలపై తగు చర్యలు తీసుకొని పూర్తిగా బంధు చేసేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఈసి అనుమతితో ఉపాధ్యాయ సమస్యలను పరిష్కారించాలి

- పిఆర్టియు మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి కృష్ణ

నవతెలంగాణ-మెదక్

ఈసి అనుమతితో ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని పిఆర్టియు మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఉద్యోగ ఉపాధ్యాయుల సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఉద్యోగుల పాలిట శాపంగా మారిన 317 జీవోను రద్దు చేయాలన్నారు. ఎలక్షన్ కమిషన్ అనుమతితో ఉద్యోగాలకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న డీఏలను, మెడికల్ బిల్లులు చాలా రోజుల నుంచి పెండింగ్లో ఉన్న జిపిఎఫ్ పార్ట్ ఫైనల్ లోన్ లను వెంటనే విడుదల చేయాలన్నారు. ఎస్ఎస్ఎ ఉపాధ్యాయులకు టైం స్కేల్ వర్తింపచేయాలని, కేజీబీవి, మోడల్ స్కూల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కారించాలన్నారు. భార్య భర్తల పోస్టింగు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.

నిజాంపేటలో వంద పడకల ఆసుపత్రి కట్టించాలి

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రొసిడింగ్ వచ్చింది
- పనులు ప్రారంభించేది ఎప్పుడు?

నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండాలని గతంలో ప్రభుత్వం పదేపదే చెప్పడం జరిగింది. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించాలని గత ప్రభుత్వాలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని మండల ప్రజలు వాపోతున్నారు. మండలంలోని గ్రామాల ప్రజలకు ఎలాంటి రోగాలు వచ్చినా హైదరాబాదు, కామారెడ్డి, సిద్దిపేట, లాంటి పట్టణాలకు వెళ్లవలసిన పరిస్థితి. ప్రైవేట్ ఆస్పత్రిలో వారు లక్షల కొద్ది డబ్బులు గుంజుతున్నారని డబ్బులు లేక పేదవారు మధ్యలోనే మరణిస్తున్నారని మండల ప్రజలు వాపోతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో నిజాంపేట మండల కేంద్రానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరి అయ్యిందని మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి ప్రొసీడింగ్ వచ్చిందని తెలిపారు. దీంతో నిజాంపేట మండల కేంద్రంలో అప్పటి ముఖ్యమంత్రి, మాజీమంత్రి హరీష్ రావు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డిల ఫోటోలకు నాయకులు పాలాభిషేకాలు కూడా చేశారు. ప్రొసీడింగ్ వచ్చినట్లయితే పనులు ఎప్పుడు మొదలుపెడతారో అంటూ మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు వెంటనే స్పందించి నిజాంపేట మండల కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి కట్టించే విధంగా కృషి చేయాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-నిజాంపేట: రామాయంపేట పిఎసిఎస్ పరిధిలోని వడ్ల కొనుగోలు కేంద్రాలను సెంటర్ల ఇన్చార్జీలు ఆదివారం ప్రారంభించారు. నస్కల్, నగరం, రాంపూర్, నందగోకుల్, నార్లాపూర్, తిప్పనగుల్ల, చల్మెడ, సెంటర్ల ఇన్చార్జీలు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలలోనే వడ్లు అమ్ముకోవాలని, దళారులను నమ్మి మో సపో వద్ద న్నారు. ఎన్నికల



కోడ్ అమ ల్లో ఉన్నం దున ఇన్చార్జిలకే అప్పజెప్పడం జరిగిందన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని చేబర్తి జిల్లా పరిషత్తు ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో 2010-2011 సంవత్సరం చదివిన విద్యార్థులు ఆదివారం గణేష్ పల్లిలో గల వ్యవసాయ క్షేత్రంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలోని మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనంతో 14 సంవత్సరాల తర్వాత వారంతా ఒకచోట చేరి కలుసుకున్నారు. ఇన్ని సంవత్సరాల తర్వాత నాటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరికి ఒకరు ఆత్మీయంగా పలకరించుకొని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి కబుర్లు చెప్పుకుంటూ వారి క్షేమ సంగతులను అడిగితెలుసుకున్నారు. విద్యాబుద్దులు నేర్పిన గురువులు



పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయసింహా రెడ్డి ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేశారు. నాటి ఉపాధ్యాయులను శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశం, కనకారావు, భూపతి రెడ్డి, చిన్ని కృష్ణ, విద్యార్థులు కరుణాకర్, భాస్కర్, ఏ.బాబు, బాలరాజు, ప్రవీణ్, బాలస్వామి, బలరాం, ఎన్.బాబు, జి.బాలచంద్రం, బాలకృష్ణ, తిరుపతి, శ్రీకాంత్ ,కే.బాల చంద్రం, నర్సింలు, ప్రవీణ్, సంగీత, పద్మ, సునీత, సంతోష, సుజాత, శ్రీవాణి, రాజేశ్వరి, మమత, అమరావతి, తదితరులున్నారు.

కోహెడలో ఘనంగా పోచమ్మ బోనాలు

నవతెలంగాణ-కోహెడ: మండల కేంద్రంలో మాదిగ కులస్తుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు చప్పుల్లతో మహిళలు నెత్తిన బోనాలను ఎత్తుకొని అమ్మవారి ఆలయం వరకు చేరుకొని నైవేద్యం సమర్పించారు. ఈ ఏడూ వర్షాలు సమృద్ధిగా కురిసి, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని



ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుల సంఘం నాయకులు, గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

- నుజ్జునజ్జు అయిన శరీర భాగాలు

నవతెలంగాణ-నర్సాపూర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన ఆదివారం నర్సాపూర్ పట్టణంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం చింతల్ పల్లి గ్రామానికి చెందిన మద్ల కుర్మయ్య (45) నర్సాపూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామ సమీపంలోని సుగుణ పౌల్ట్రీ పరిశ్రమలో ఉద్యోగం చేస్తూ కుర్మయ్య జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే ఆదివారం నాలుగు గంటల ప్రాంతంలో బైక్‌పై సంగారెడ్డి వైపు వెళ్తుండగా పట్టణంలోని హెచ్ పి పెట్రోల్ బంక్ ఎదుట సంగారెడ్డి నర్సాపూర్ ప్రధాన రహదారిపై బైకును కారు ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న కుర్మయ్య రోడ్డుపై కింద పడడంతో వెనకాల నుంచి వస్తున్న బోర్ వెల్స్ లారీ కుర్మయ్యపై నుంచి వెళ్లడంతో శరీర కింది భాగాలు నుజ్జు నుజ్జు అయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఎస్సై పుష్ప రాజ్ తన బలగాలతో సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అక్కడి వారిని అడిగి తెలుసుకున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పుష్ప రాజ్ తెలిపారు.



డ్రైవర్ నిర్లక్ష్యంతో యువకుని మృతి

- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-వెల్దుర్తి

డ్రైవర్ అజాగ్రత్త నిర్లక్ష్యం కారణంగానే తన కొడుకు మృతి చెందాడని మృతుడి తండ్రి గణేష్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఆదివారం ఎస్సై నవత గౌడ్, మృతుని తండ్రి గణేష్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి మండల పరిధిలోని మన్నేవారి జలాల్పూర్ గ్రామానికి చెందిన జాల నరేష్ (18) శనివారం ఉదయం అదే గ్రామానికి చెందిన చిట్యాల యాద గౌడ్ తన ట్రాక్టర్‌పై గ్రామానికి పశుగ్రాసం తరలించడానికి ఆయన వెంట తీసుకొని వెళ్ళాడు. తిరిగి గ్రామానికి వస్తున్న క్రమంలో హస్తాల్పూర్ గ్రామ శివారు వద్ద ట్రాక్టర్‌పై యాదగౌడ్ పక్కనే ఉన్న వాటర్ బాటిల్ తీసుకొని తాగుతుండగా ఒక్కసారిగా కింద పడిపోయాడు. దీంతో నరేష్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ యాద గౌడ్ నిర్లక్ష్యం వల్లనే తన కుమారుడు నరేష్ మృతి చెందాడని యాద గౌడ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవత గౌడ్ తెలిపారు.



తునికి నల్ల పోచమ్మ ఆలయానికి రూ.10 వేల ఆర్థిక సహాయం

నవతెలంగాణ-కౌడిపల్లి

కౌడిపల్లి మండల పరిధిలో తునికి శివారులో గల శ్రీ నల్లపోచమ్మ ఆలయం అభివృద్ధి కోసం పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. శివంపేట మండల బిఆర్ఎస్ నాయకులు బుద్దల బిక్షపతి ఆలయ అభివృద్ధి కోసం అందజేశారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ నల్ల పోచమ్మ అమ్మవారికి అభివృద్ధి కోసం పదివేల ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. భక్తులు కోరుకున్న కోరికలు తీర్చే అమ్మవారి దయవల్ల నర్సాపూర్ తాలూకా ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకోవడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు దొంతుల దుర్గయ్య, ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



స్వయంభు శివలింగాన్ని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతం

- కేదార్నాథ్ ప్రధాన అర్చకు లు శివలింగ స్వామి

నవతెలంగాణ-వెల్దుర్తి

మండల పరిధిలో బస్వాపూర్ పరిసరాల్లో మల్లన్న గుట్ట లోయలో స్వయంగా వెలిసిన శివలింగాన్ని ఆదివారం దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని కేదార్నాథ్ ప్రధాన అర్చకులు శివలింగ స్వామి అన్నారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వయంగా వెలిసిన శివలింగంకు నిత్య దూపదీప నైవేద్యంలో పాల్గొన్న భక్తులు ఎంతో పుణీతులవుతా రన్నారు. భక్తి భావనతో శివుని ఆత్మ శివలింగాన్ని పూజిం చడంలో మనోధైర్యం, బుద్ధి జ్ఞానం విరజిల్లుతుందన్నారు. ఇతరుల పట్ల ప్రేమ భావం ఆప్యాయత అనురాగం పెంపొందుతుందన్నారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు తలారి మల్లేశంతో పాటు కమిటీ సభ్యులు శాలలతో సన్మానించి ఆశీర్వాదం పొందారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
సిద్దిపేట
సోమవారం | 08 ఏప్రిల్ 2024 | www.navatelangana.com

నేతాజీ నగర్‌లో నీటి సమస్య తీర్చిన మంత్రి



నవతెలంగాణ - హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణం లోని నేతాజీనగర్ తాగునీటి సమస్య ఉందని ఆదివారం మంత్రి దృష్టికి కాంగ్రెస్ నాయకులు తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి మున్సిపల్ కమిషనర్ కు తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ వెంటనే బోరు లో నూతన మోటర్ బిగించి తాగునీటి సమస్యలు పరిష్కరించారు. నేతాజీ నగర్ లో తాగునీటి సమస్య పరిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు మున్సిపల్ చైర్మన్ రజిత, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్యకు కాంగ్రెస్ పట్టణ యువజన అధ్యక్షుడు చెన్నవేనీ విద్యాసాగర్ కృతజ్ఞతలు తెలిపారు.

జగదేవపూర్ గ్రామంలో కోటి తలంబ్రాల దీక్ష విజయవంతం



నవతెలంగాణ - జగదేవపూర్

భద్రాచల సీతారాముల కల్యాణానికి గ్రామ గ్రామాన కోటి తలంబ్రాల దీక్షను నిర్వహించి వడ్లను ఒలిపించి తలంబ్రాలుగా తయారు చేయించే బాధ్యత భద్రాచల దేవస్తానం వారు గజ్వేల్ లోని శ్రీరామకోటి భక్త సమాజం అధ్యక్షులు రామకోటి రామరాజుకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆదివారం నాడు జగదేవపూర్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గోటి తలంబ్రాల కార్యక్రమం నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి 3 గంటల పాటు రామనామ స్మరణ చేస్తూ గోటితో వడ్లను ఒలిచి తలంబ్రాలగా చేసి సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ది శంకర్, వంటేరు నర్సింహారెడ్డి, చంద్రశేఖర్, కొండల్, వెంకటేశం, లక్ష్మీనర్సయ్య, రాజయ్య, రఘురాం పాల్గొన్నారు.

మామ అల్లుళ్లను ఇంటికి పంపిస్తా

- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

నవతెలంగాణ -గజ్వేల్

మామ అల్లుళ్లను త్వరలోనే ఇంటికి పంపిస్తానని, గజ్వేల్ సిద్దిపేట గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సవాల్ విసిరారు. ఆదివారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఇంటిలో మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధి ప్రజలకు అందుబాటులో ఉండాలని గజ్వేల్‌లో మాత్రం గెలిపించిన ఎమ్మెల్యే కనిపించడం లేదని రాబోయే ఎన్నికల్లో గజ్వేల్‌లో నర్సారెడ్డి కూతురు అంక్షారెడ్డిని ఎమ్మెల్యేగా చేసి మంత్రిని చేస్తానని ఆయన శపథం చేశారు. అదేవిధంగా సిద్దిపేటలో తాను పోటీ చేసి విజయం సాధిస్తానన్నారు. మామ అల్లుళ్ల ఇంటిపట్టుకు ఉండాలని ఆయన పేర్కొన్నారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఫామ్ హౌస్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారని గజ్వేల్ ప్రజలకు అందుబాటులో లేని ఎమ్మెల్యే అవసరమా అని ఆయన ప్రశ్నించారు. మెదక్ పార్లమెంటు అభ్యర్థి నీలం మధుకు గజ్వేల్ నియోజకవర్గంలో 50 వేల మెజార్టీ ఇచ్చి గెలిపించాలన్నారు. కేసీఆర్ కన్నా ఒక్క ఓటు ఎక్కువ వచ్చిన తామే విజయం సాధించినట్లని ఆయన పేర్కొన్నారు. తిరుపతి వెంకటేశ్వర స్వామి సాక్షిగా చెపుతున్న మామ అల్లుళ్లని మాత్రం తాను వదలనని ఆయన అన్నారు. గజ్వేల్‌లో మూడుసార్లు కేసీఆర్‌ను గెలిపించినందుకు గజ్వేల్ ప్రజలకు అభినందనలు తెలుపుతున్నానన్నారు. ఆయన గజ్వేల్ ముఖం చూడకున్నా ఓట్లు వేసి గెలిపిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

నీలం మధు నవ యువకుడని ప్రజా అవసరాలను ప్రజా సమస్యలను తెలిసిన వ్యక్తి కష్టజీవిగా పైకి వచ్చారన్నారు. అలాంటి వ్యక్తిని గెలిపిస్తే గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన అన్నారు. పార్లమెంటు అభ్యర్థిగా నీల మధు గెలిస్తే గజ్వేల్‌లోనే నిధులను కేటాయించి అభివృద్ధి చేస్తామని ఆయన చెప్పారు. అదేవిధంగా మైనంపల్లి, నర్సారెడ్డి ఆధ్వర్యంలో రెండు ట్రస్టులను ఏర్పాటు చేసి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను తాము పరిష్కరిస్తామన్నారు. 2029లో వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో నర్సారెడ్డిని పోటీ చేసే విధంగా శాయశక్తుల కృషి చేస్తానన్నారు. అంతేకాకుండా దేశంలో కాంగ్రెస్ వస్తుందని మైనార్టీలకు రూ 4000 కోట్లు బడ్జెట్ కేటాయిస్తున్నట్లు రాహుల్ గాంధీ ప్రకటించినట్లు ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ 100 రోజుల్లో అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలు చేసిందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటారని తనను మెదక్ పార్లమెంటు సభ్యులుగా గెలిపించాలని అభ్యర్థి నీలం మధు తెలిపారు. పార్లమెంటులో తాను గెలిస్తే గజ్వేల్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెడతానన్నారు. ఇక్కడ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉండటంతో ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేస్తానన్నారు. నిధులు కూడా ఎక్కువ శాతంగా గజ్వేల్‌కు కేటాయించి అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మాట్లాడుతూ గజ్వేల్‌లోకి గెలిచిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఇక్కడ ప్రజలు బాధలు చెప్పుకునే పరిస్థితి లేదన్నారు. పదవి ఉన్నా లేకున్నా తాను అందుబాటులో ఉంటున్నట్లు ఆయన చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందని గజ్వేల్ నియోజకవర్గంలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను అందుబాటులో ఉంటానని ఆయన చెప్పారు. మైనంపల్లి హనుమంతరావు తనకు కొండంత అండగా ఉన్నారని, ఆర్థికంగా సామాజికంగా ఆదుకుంటున్నారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, పార్లమెంట్ ఇన్చార్జి ప్రమోద్ కుమార్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫయీముద్దీన్, నరసింహారెడ్డి, మీడియా ఇన్చార్జి నక్క రాములు గౌడ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నర్సారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ బలోపేతం



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గంలో పాటు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ లో కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో బలోపేతం అవుతుందని గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ నాయకులు మామిడి కృష్ణ అన్నారు. ఆదివారం గజ్వేల్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు. పార్లమెంటు, ఎంపీపీ, జడ్పిటిసి, సహకార ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు. అందుకు కావలసిన ప్రణాళికను గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి వేస్తున్నారన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రజా సమస్యలను నర్సారెడ్డి తక్షణమే పరిష్కారం చేస్తున్నట్లు అని చెప్పారు. నిరంతరంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఆయన అన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదని చెప్పిన గత ప్రభుత్వం ,నాయకులు తప్పుడు ప్రచారం చేశారని ఆయన అన్నారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును అందిస్తున్నామన్నారు. రూ 500 రూపాయలకే గ్యాస్ పంపిణీ చేస్తున్న మన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సక్సెస్ అయిందన్నారు. ఇందిరమ్మ పథకం ద్వారా పేదలకు మరింతగా దగ్గర అవకాశం ఉందని ఆయన అన్నారు. పూరి గుడిసెల్లో నివసిస్తున్న వారికి మొదటగా ప్రాధాన్యత ఇస్తామని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆదేశాలతో పేదలకు అందించేందుకు కసరత్తు జరుగుతుందన్నారు.

నీలం మధును భారీ మెజార్టీతో గెలిపిస్తాం



కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తప్పటి సుధాకర్

నవతెలంగాణ- రాయపోల్

మెదక్ ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న నీలం మధు ముదిరాజ్ ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని కాంగ్రెస్ పార్టీ రాయపోల్ మండల అధ్యక్షులు తప్పటి సుధాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెసిఆర్ పది సంవత్సరాల నియంత పాలనకు తెలంగాణ రాష్ట్ర ప్రజలు చరమగీతం పాడి, కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడం జరిగిందన్నారు. 6 గ్యారంటీలు పథకాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారమే 100 రోజులలో ఆరు గ్యారెంటీలను అమలు చేసి రాష్ట్ర ప్రజల మెప్పు పొందిందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించడం కాంగ్రెస్ తోనే సాధ్యమవుతుందని ప్రజలను నమ్మారు కాబట్టే కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని అన్నారు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన అందిస్తూ ఐదు ఏళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి అవకాశం కల్పించి మెదక్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న నీలం మధు ముదిరాజ్ ను భారీ మెజార్టీతో గెలిపిస్తే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ రాజ్యాన్ని దేశంలో తీసుకురావచ్చు అన్నారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ మతాన్ని నమ్ముకుని రాజకీయం చేస్తుందని, అభివృద్ధి చేసింది లేదు కానీ కులమత రాజకీయాలతో ప్రజలను రెచ్చగొడుతూ అల్లకల్లోలు సృష్టిస్తుందన్నారు. మరొక్కసారి బిజెపిని అధికారంలోకి రాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మోడీ నాయకత్వంలో మూడోసారి అధికారం



నవతెలంగాణ - గజ్వేల్

మెదక్ పార్లమెంటు బీ జే పీ అభ్యర్థి రఘునందన్ రావు గెలుపు ఖాయమని సిద్దిపేట జిల్లా బీజే పీ మోర్చా అధ్యక్షులు నత్తి శివకుమార్ అన్నారు. ఆదివారం ప్రకటనలో విడుదల చేశారు. మోడీ నాయకత్వంలో మూడోసారి కేంద్ర ప్రభుత్వం ఏర్పడుతుందని ఆయన అన్నారు.

రైతు ద్రోహి కాంగ్రెస్ ప్రభుత్వం

గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్



నవతెలంగాణ- గజ్వేల్

రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ద్రోహిగా మారిందని గజ్వేల్ పట్టణ బీ జే పీ అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ అన్నారు. గజ్వేల్ బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వెంటనే రెండు లక్షల రుణమాఫీ చెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు. పదిహేను వేల రూపాయలు రైతు భరోసా రైతుల ఖాతాల్లో జమచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శులు కోలుపుల నరేందర్, ఐల మహేందర్, మంద వెంకటేష్, బిజెపి గజ్వేల్ పట్టణ ఉపాధ్యక్షులు మైస విజయ్, నాయిని సందీప్, చేప్యాల వెంకట్ రెడ్డి, వడ్డేపల్లి ప్రసాద్, నరసింహ ముదిరాజ్, బిజెపి గజ్వేల్ పట్టణ కోశాధికారి లింగంపల్లి హరి కుమార్, బిజెపి గజ్వేల్ పట్టణ మహిళా మోర్చ అధ్యక్షురాలు కుంకుమ రాణి, బిజెపి గజ్వేల్ పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షులు సంగేం కర్ణకర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు సహాయం చేయడమే వాసవి క్లబ్ ఉద్దేశం

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు గంప శ్రీనివాస్




నవ తెలంగాణ - సిద్దిపేట

నిరుపేదలకు సహాయం చేయడమే వాసవి క్లబ్స్ ఉద్దేశమని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు గంప శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నిరుపేద కుటుంబానికి చెందిన కూరా అరవింద్ మరణించగా వారి తల్లిదండ్రులు లక్ష్మీ ఈశ్వర్ లకు వాసవి క్లబ్, వాసవి యూత్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో క్లబ్ సభ్యుల సహకారంతో రూ 46వేల వారి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా సేవ లు అందిస్తున్న ఏకైక క్లబ్ వాసవి క్లబ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ నాయకులు పుల్లూరి శివకుమార్, గంప కృష్ణమూర్తి, యాద శ్రీనివాస్, బచ్చు రమేష్, చింత రాజేంద్రప్రసాద్, బురుగు వేణు, ఇల్లందుల నాగేందర్, అయిత పురుషోత్తం, వాసవి క్లబ్ అధ్యక్షులు చెకలం రవి, యూత్ క్లబ్ అధ్యక్షులు అరవపల్లి హరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్లైన్లో మల్లన్న ఆర్జిత సేవలు

- టి యాప్ లో సేవల బుకింగ్ సౌకర్యం
- తీరనున్న భక్తుల కష్టాలు
- యూపీఐ స్కానర్ల ఏర్పాటుకు విజ్ఞప్తులు

T App Folio





నవ తెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు భక్తులు జిల్లాల నుండే కాకుండా వివిధ రాష్ట్రాల వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు స్వామి వారి ఆర్జిత సేవల టికెట్ల కొరకు గంటల తరబడి లైన్లో నిలబడాల్సిన పరిస్థితి ఉంది. గతంలో భక్తుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు దేవాదాయ శాఖ తీసుకున్న నిర్ణయంతో భక్తుల కష్టాలు టి యాప్ ద్వారా తీరనున్నాయి. గంటల తరబడి భక్తులు లైన్లో నిలబడి మల్లన్న ఆర్జిత సేవ టికెట్ల కోసం వేచి ఉండే బాధలు తప్పనున్నాయి. దేవాదాయ శాఖ మల్లన్న ఆలయ ఆర్జిత సేవల టికెట్లను ఆన్లైన్‌లో బుక్ చేసుకునే సౌకర్యం కల్పిస్తుంది.

టీ యాప్‌లో ఆలయ సేవలు

స్వామివారి ఆలయంలో ప్రతిరోజు నిర్వహించబడు మొక్కుబడులు, ఆర్జిత సేవలు 25 రకాలుగా ఉన్నాయి. అందులో 12 రకాల సేవలను టీఆప్‌లో పొందుపరిచారు. మల్లన్న ఆర్జిత సేవలను బుక్ చేసుకోవాలనుకుంటున్న భక్తులు ముందుగా మొబైల్‌లోని ప్లే స్టోర్‌లో టీ యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని వివరాలు పొందుపరిస్తే ఆలయంలో అందుబాటులో ఉన్న ఆర్జిత సేవలు కనిపిస్తాయి భక్తులకు కావలసిన స్వామి సేవలను బుక్ చేసుకునే సౌకర్యం ఉంది. ప్రస్తుతానికి సేవలు 1) స్వామి వారి సన్నిధిలో అభిషేకం2) చలుక పట్నం 3) కుంకుమ అర్చన 4) ముఖ మండప పట్నం 5) నజరు పట్నం 6) శాశ్వత కళ్యాణం 7) శాశ్వత పూజ 8) స్వామివారి నిత్య కళ్యాణం 9) కోడె తిరుగుడు 10) మల్లన్న వి వి ఐ పి దర్శనం, 11) ఎల్లమ్మ అర్చన 12) ఎల్లమ్మ పట్నం లాంటి సేవలు టి.యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. ఈ ఆర్జిత సేవలు ఆన్లైన్లో బుక్ చేసుకున్న వారికి ఆలయంలో ఉన్న ధరలపై ఒక్కో సేవకు రూ 5 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

యూపీఐ సేవలకు భక్తుల నుడి విజ్ఞప్తులు

ప్రస్తుతం ఎక్కడ కొనుగోలు జరిపిన నగదును వాడడం తక్కువైంది. ప్రస్తుతం ఆన్లైన్ పేమెంట్స్, యూపీఐ ఫోన్ పే గూగుల్ పే ల ద్వారా లావాదేవీలు జరుపుతున్నారు. మల్లన్న ఆలయంలో ఎక్కడ ఏ అవసరానికైనా నగదు లావాదేవీలు తప్పడం లేదు. దీనికి తోడు ఆలయం వద్ద ఏటీఎంలు అందుబాటులో లేక నగదు కోసం జాతర సమయాల్లో భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీన్ని ఆసరా చేసుకున్న కొందరు వ్యాపారుల చేతివాటం చూపెడుతూ రూ 100 నగదు కావాలంటే నే రూ10 నుంచి రూ 20 కమిషన్ కట్ చేస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో భక్తులు తలొగ్గుతున్నారు. ఆలయంలో లడ్డు ప్రసాదాల కౌంటర్ వివిఐపి దర్శన టికెట్లు, స్వామి వారి సేవ టిక్కెట్లు, ఆలయ గదుల కేటాయింపు కౌంటర్ల వద్ద ఫోన్ పే గూగుల్ పే స్కానర్లు ఏర్పాటు చేస్తే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందని మల్లన్నభక్తులు భావిస్తున్నారు.

దేవాదాయ కమిషనర్ అనుమతులు కోరుతాం

ఆలయ ఈఓ బాలాజీ శర్మ



ఆలయంలో పలు విభాగాల వద్ద ఫోన్‌పే గూగుల్‌పే స్కానర్లు ఏర్పాటు చేయాలని భక్తుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయి. యూపీఐ పేమెంట్ స్కానర్లు ఏర్పాటు కొరకు దేవాదాయ శాఖ కమిషనర్ అనుమతికి ప్రపోజల్ పంపుతాం ఆర్డర్ వచ్చిన వెంటనే ఏర్పాటు చేస్తాము. ప్రస్తుతం టీ యాప్ ఆన్లైన్‌లో ఉన్న సేవలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలి.

17 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ జగదేవపూర్

జగదేవపూర్ మండల కేంద్రంలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచిన విషయం నమ్మదగిన సమాచారం మెరకు సిద్దిపేట టాస్క్ పోర్స్ పోలీసులు జగదేవపూర్ పోలీసుల సహకారం తో తనిఖీ చేశారు. చేయగా 17.5 క్వింటాళ్ల ప్రభుత్వ రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు.ఈ నెల 6న రాత్రి సమయంలో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు.వాళ్ల వెంకటేష్, ఊడ లక్ష్మీ నర్సయ్య, బుద్ధ రాములు వారి యొక్క షాపులలో ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేయగా వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు, మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ మేడమ్ ఆదేశానుసారం జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక , పిడిఎస్ రైస్ అక్రమ రవాణా చేసిన నిల్వ ఉంచిన, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం, గ్యాంబ్లింగ్ చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామాలలో, పట్టణాలలో ఇసుక అక్రమ రవాణా చేసిన, పిడిఎస్ రైస్ అక్రమంగా దాచిపెట్టిన రవాణా గ్యాంబ్లింగ్, పేకాట, మరిఏదైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు

ఉగాది కవి సమ్మేళనం విజయవంతం చేయాలి



నవ తెలంగాణ- గజ్వేల్

టిపిటిఎఫ్ గజ్వేల్ జోన్ సకల జనుల రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే క్రోది నామ సంవత్సర 'ఉగాది' కవి సమ్మేళన కార్యక్రమానికి సంబందించిన కర పత్రాన్ని ఆదివారం టిపిటిఎఫ్ గజ్వేల్ జోన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోన్ కన్వీనర్ సుంచు నరేందర్ అధ్యక్షులు కటుకం రాజయ్యలు మాట్లాడుతూ ప్రతి సమాజంలో వస్తున్న మార్పుల పట్ల శాస్త్రీయ అవగాహన కలిగి ఉండటం సామాజిక బాధ్యతగా గుర్తు చేస్తూ గత పది సంవత్సరాల నుండి గజ్వేల్ పట్టణములో టిపిటియఫ్ గజ్వేల్ జోన్ సకల జనుల రచయితల సంఘం వారిఆధ్వర్యంలో "ఉగాది కవి సమ్మేళనము" కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. యువ కవులను, విద్యార్థులను భాగస్వాములను చేసి ప్రోత్సహిస్తామన్నారు. ప్రకృతి వనరుల విధ్వంసం సమాజంలో విలువల విధ్వంసం కొనసాగుతున్న నేటి తరుణంలో మనం ఉగాది నిర్వహిస్తామన్నారు. ప్రకృతిని కాపాడుకోవలసిన బాధ్యత మనందరిపైన ఉన్నది అని, విలువలను పరిరక్షించడంలో భాగస్వాములను కావాలన్నారు. ఉగాది అంటేనే మార్పు, వసంతం అందరి సొంతం కావాలి, షడ్రుచులు అందరి జీవితాలలో భాగం కావాలని . కవులు, కళాకారులు, రచయితలు రావాలని వారు తెలిపారు. తమ సాహిత్య ప్రక్రియలైన ఆట, పాట, మాట, కవిత పద్య రూపాలలో వ్యక్తపరచడానికి మంగళవారం సాయంత్రం 05:00 గంటలకు టిపిటిఎఫ్ గజ్వేల్ జోన్ కార్యాలయంలో నిర్వహించే "ఉగాది కవి సమ్మేళనం" కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, గజ్వేల్ మండలాధ్యక్షులు పాపిరెడ్డి,గజ్వేల్,జగదేవపూర్,దౌల్తాబాద్ మండలాల ప్రధాన కార్యదర్శులు నాగరాజు, సత్తయ్య, యాదయ్యసీనియర్ నాయకులు ఎల్లయ్యశ్రీనివాస్,భాస్కర్ లు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



నవ తెలంగాణ-మిరు దొడ్డి

అప్పుల బాధతో రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో చోటుచేసుకుంది. తొగుట గ్రామానికి చెందిన రైతు చిక్కుడు శ్రీనివాస్ (49) మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణంలో భూమిని కోల్పోయాడు. దీంతో మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో భూమిని కొనుగోలు చేసి వ్యవసాయం చేస్తున్నాడని స్థానికులు తెలిపారు. అప్పులు అధికం కావడంతో వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడడం జరిగిందన్నారు. స్థానిక రైతులు గమనించి, ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శ్రీనివాస్ మృతి చెందినట్లు ఎస్ఐ పరశురాం తెలిపారు.

రోడ్డు ప్రమాదం వ్యక్తికి తీవ్ర గాయలు



నవ తెలంగాణ-మిరు దొడ్డి

మిరుదొడ్డి శివారులో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోను డీసీఎం కొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామానికి చెందిన పేద లింగన్నగారి బిక్షపతి ఆటోలో కిరాణా సామాగ్రిని తీసుకెళ్తున్న క్రమంలో ప్రమాదం చోటుచేసుకుంది. ఆటోను వెనక నుంచి వస్తున్న డీసీఎం ఓవర్టేక్ చేసే క్రమంలో డీసీఎం ఆటోను ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. బిక్షపతికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు

మృతుల కుటుంబాలకు ఫార్మర్ ఫ్రస్ట్ ఫౌండేషన్ చైర్మన్ ఆర్థిక సహకారం



నవ తెలంగాణ - సిద్దిపేట

పట్టణంలోని అంబేద్కర్ నగర్ కాలనీ లోని నిరుపేద కుటుంబానికి చెందిన గ్యదరి రంజిత్ అనారోగ్య కారణంగా మరణించగా వీరి కుటుంబానికి రూ 15వేలు ఆర్థిక సహాయం ఫార్మర్ ఫ్రస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్ గౌడ్ ఆదేశాల మేరకు ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. అదేవిధంగా ఇందిరమ్మ కాలనీకి చెందిన చేపూరి వెంకటేశం గౌడ్ అనారోగ్య కారణంగా మరణించగా వీరి కుటుంబానికి రూ 10వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా మహాదేవుని శ్రీనివాస్



నవ తెలంగాణ -కొమురవెల్లి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా మహాదేవుని శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యాలయం గాంధీభవన్ నుంచి జారీ చేసిన నియామకపత్రాన్ని అందుకున్నారు. ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తనను నియమించిన మాజీ ఎమ్మెల్యే జనగామ జిల్లా డిసిసి అధ్యక్షులు, కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి ధన్యవాదాలు చెప్పారు.

భక్తులతో కిటకిటలాడిన మల్లన్న జాతర

పట్నాలు వేసి బోనాలు చెల్లింపు
స్వామి దర్శనానికి 4 గంటల సమయం
అగ్నిగుండాలపై నడిచేందుకు భారీగా వచ్చిన భక్త జనం



నవతెలంగాణ - కొమురవెల్లి

కొమురవెల్లి మల్లికార్జున స్వామి జాతరకు భక్తులు భారీగా హాజరయ్యారు. ఆదివారం భారీ సంఖ్యలో భక్తులు మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. 12 వ వారం చివరి జాతర వారం కావడంతో సుమారు 50 వేల మంది దర్శించుకున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయ పరిసరాలన్నీ జనసంద్రంతో నిండి కళకళలాడాయి వేకువ జాము నుంచే పోటెత్తిన భక్తులు మొదట తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో స్నానాలు చేసి భక్తులు ఆ మల్లన్నకు బోనం సమర్పించి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు గంగరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. భక్తులు బస చేసిన ప్రాంతాల్లో , గంగరేగు చెట్టు వద్ద, ఆలయ ముఖ మండపంలో పట్నాలు వేసి, మల్లన్న స్వామి కి చీర సారెలు ఒడిబియ్యం సమర్పించేందుకు శీఘ్ర, అతి శీఘ్ర, ధర్మ దర్శనాల ద్వారా వెళ్లి స్వామిని దర్శించారు. స్వామి వారి దర్శనానికి సుమారు 4 గంటల సమయం పట్టింది. అనంతరం గుట్టపై ఉన్న ఎల్లమ్మ తల్లికి ఒడిబియ్యం పోసి బెల్లం పాయసం, కల్లుసాక పోసి బోనాలు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు.



తోట బావి ప్రాంగణంలో అగ్నిగుండాలు

ఆలయ అధికారులుఅగ్నిగుండాల కార్యక్రమాన్ని నిర్వహించేందుకు తోట బావి ప్రాంగణంలో కు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. అగ్నిగుండాలు కాల్చేందుకు వంట చెరుకును సిద్ధం చేశారు. వీరశైవ సాంప్రదాయం ప్రకారం నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీరశైవ జగద్గురు వికారాబాద్ జిల్లా ఆలంపల్లి మండల కేంపి మఠాదీశ్వరుడు, చెన్న బసవ ప్రభువు మహాస్వామి వచ్చారు.

సావర్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

నవ తెలంగాణ - సిద్దిపేట : పట్టణంలోని స్థానిక పాత బస్టాండ్ వద్ద ప్రయాణికుల, స్థానికుల దాహార్తి తీర్చడం కోసం చలివేంద్రం ప్రారంభించినట్లు బిజెపి జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి తెలిపారు. సావర్కర్ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుమన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

